www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 మే 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

విఎస్‌యు కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ఆచార్య సిహెచ్ విజయ

ప్రజాశక్తి-వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య సిహెచ్ విజయ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు విక్రమ సింహపురి విశ్వవిద్యాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేషన్ సభ్యులు కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన ప్రిన్సిపల్ విజయ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఉపకులపతి జిఎం సుందరవల్లి ఆధ్వర్యంలో సాధించుకున్న నాక్‌ఏ గ్రేడును దృష్టిలో ఉంచుకొని మనమందరం కలిసి పనిచేసే భవిష్యత్తులో విశ్వవిద్యాలయానికి, విశ్వవిద్యాలయ అధికారులకు మంచి పేర్లు తీసుకొస్తామని తెలిపారు. అన్ని విషయాల్లో తమ వంతు సహకారం అందిస్తామని ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ బివి సుబ్బారెడ్డి తెలిపారు.

సన్మానిస్తున్న దృశ్యం

ఓటుకు పల్లె..పట్టణం కదిలింది..!

2024 ఎన్నికల్లో జిల్లా చరిత్రలోనే అత్యధిక పోలింగ్ జరిగింది. ఇందులో ఓటర్ల చైతన్యం ఓ వైపు, డబ్బు ప్రభావం మరో వైపు.. అధికారుల ప్రచారం అన్ని అంశాలు కలిసి ఉన్నట్లు కనిపిస్తోంది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో ఓటర్లు అపార్ట్‌మెంట్ల నుంచి కదలివచ్చి ఓటు హక్కు వినియోగి ంచుకున్నారు. అందుకే నెల్లూరు నగర ంలో 71.72 శాతం, నెల్లూరు రూరల్‌లో 67.76శాతం వచ్చింది. కందుకూరు, కావలి పల్లె ప్రాంతాల్లో కొన్ని బూత్‌లలో 98 శాతం వరకు పోలింగ్ జరిగింది. మహిళలు, యువకులు, ఉద్యోగులు, మధ్యతరగతి, వ్యాపారులు పోలింగ్‌కు రావడంతో టిడిపి, వైసిపి ఇవి మా ఓట్లు అంటూ లెక్కలు చూసు కుంటున్నారు. గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

- ◆జిల్లాలో 79.63 శాతం పోలింగ్
- ◆నెల్లూరు, నెల్లూరు రూరల్‌లో పెరిగిన ఓట్లు
- ◆పల్లెల్లో కొన్నిచోట్ల 98 శాతం
- ◆పోలింగ్‌పై ఎవరి ధీమా వారిదే..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు చైతన్యం ప్రకటించారు.బుధవారం ఉదయం అధికారులు అధికారికంగా పోలింగ్ శాతం విడుదల చేశారు. జిల్లా వ్యాపితంగా 79.63 శాతం వరకు నమోద య్యింది. కందుకూరు నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ జరిగింది. 88.96శాతం వచ్చింది. ఈ నియోజకవర్గాల్లోని పల్లెల్లో భారీగా పోలింగ్ జరిగింది. కొన్ని చోట్ల 98 శాతం వరకు పోల య్యాయి. ఇరుపార్టీలు పోలింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ ప్రాంతాల్లో నగదు పంపిణీ ఎక్కువగా జరిగింది. నెల్లూరు నగంలో గతం కంటే భిన్నమైన 2019 ఎన్నికల్లో నెల్లూరు నగర ఓటర్లు 76.91 శాతం నమోదు కాగ, 2024 ఎన్నికల్లో 79.63కు పెరిగింది. ఇది నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో కలిపి, ఉదయం 6నుంచి రాత్రి 12 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఇది ప్రభుత్వ వ్యతిరేకంగా వేశారని టిడిపి నేతలంటున్నారు. వైసిపి నేతలు జగన్ పథకాల వల్ల ఇది సాధ్యమైందని చెబుతున్నారు. అధికారులు ప్రకటించిన పోలింగ్ శాతం ప్రకారం కందుకూరు 88.96 శాతం, కావలి 83.03, ఆత్మకూరు 83.49, కోవూరు 79.29, నెల్లూరు నగరం 71.72, నెల్లూరు రూరల్ 67.76, సర్వేపల్లి 83.88, ఉదయగిరి 81.92 శాతం ఉంది. ఈ పోలింగ్ గతం కంటే అధికమనే చెప్పాలి. 2019 ఎన్నికల్లో పోలింగ్ పెరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ఓట్లు

బారులు తీరిన ప్రజలు (ఫైల్ ఫొటో)

వేశారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన పసుపు కుంకుమ వల్ల పోలింగ్ పెరిగిందని ప్రచారం చేశారు. ఫలితం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చింది. ప్రస్తుతం పెరిగి పోలింగ్ విషయంలో ఇరుపార్టీలు వింత ప్రచారం చేసుకుంటున్నారు. పెరిగిన ఓట్లు తమవంటే తమ వంటూ చెబుతున్నారు. అధికారులు మాత్రం తాము నిర్వహించిన ప్రచారం కారణంగా ఓటర్లు చైతన్యంతో వచ్చి ఓట్లు వేశారని చెబుతున్నారు.

ఎవరి ధీమా..వారిదే..!

ప్రస్తుతం జరిగిన పోలింగ్ శాతం పట్టి వైసిపి, టిడిపి నేతలు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ జరిగిన తొలిరోజు వైసిపి ఎంపి అభ్యర్థివిజయ సాయిరెడ్డి విజయం పై ధీమా వ్యక్తం చేశారు. తమ కార్యాలయంలో సందడి చేసుకు న్నారు. నెల్లూరు సిటీ విజయం సాధిస్తున్నామన్నారు. పదికి పది తమవేనని చెప్పారు. పెరిగిన ఓట్లు తమవేనని ధీమాలో ఉన్నారు. ఆపార్టీ నేతలు సైతం రాష్ట్ర ప్రభుత్వం తమదేనని, 175కి 175 జిల్లాలో 10కి 10 తమవేనంటున్నారు. ఏమాత్రమూ తగ్గడం లేదు. టిడిపి నేతలు మాత్రం రాష్ట్రంలో

క్యూలో నిలుచున్న ఓటర్లు (ఫైల్ ఫొటో)

120-130 వరకు గెలుస్తామని, జిల్లాలో ఆరు స్థానాలు తమవేనని చెబుతున్నారు. ఇక్కడ అతి విశ్వాసం, అత్మ విశ్వాసం కనిపిస్తోంది. అలాగే పెద్ద ఎత్తున పందేలు సాగుతున్నాయి. గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి.

స్కాలర్‌షిప్ అందజేస్తున్న దృశ్యం

జాతీయ స్థాయి మెరిటోరియస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైన ఎన్‌సిసి విద్యార్థిని

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని కెఎన్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలకు చెందిన 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి క్యాడెట్స్ ఆరు మంది ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ్ ప్రకాస్, ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం కొండాయపాళెం, స్నేహనగర్ ప్రాంతంలోని 10 ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌షిసి కార్యాలయంలో మెడిటోరియస్ స్కాలర్షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కమాండర్ , కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే సెకండ్ ఆఫీసర్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం రక్షణ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ నేషనల్ కేడేట్ కార్ప్స్ నుంచి కేడేట్ వెల్ఫేర్ సొసైటీ మెరిటోరియస్ స్కాలర్ షిప్స్-2023కు తమ పాఠశాల విద్యార్థులు ఎన్సిసి క్యాడేట్స్ సాయ చరిణి, బొప్పూరి వకుళ ప్రవీణ్,,కీర్తిపాటి హిమ వర్షిణి,మద్దెల మహీధర్,సాధినేని వెంకట సహస్ర,కంచర్ల వెంకట దినేష్ ఎంపిక కావడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో వారు మరెంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-నెల్లూరు

క్షయ నియంత్రణలో భాగంగా జిల్లా మొత్తం 18 సంవత్సరాలు నిండిన వయోజనులకు ప్రత్యేక కేటగిరి కింద గుర్తించిన ప్రతిఒక్కరికీ అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిఎల్ఒ డాక్టరు ఖాదర్‌వలి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉచితంగా మూడు నెలలు నిర్వహిస్తామన్నారు.

రిచ్ వైద్యశాలలో 'కంగారూ మదర్ కేర్' అవగాహన సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని రిచ్ చిన్న పిల్లల వైద్యశాలలో ఇంటర్ నేషనల్ 'కంగారు మదర్ కేర్' అవగాహన స దస్సు నిర్వహించారు. బుధ వారం చేప ట్టిన ఈ సదస్సులో వైద్యశాల చైర్మన్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టరు టి.రవి కుమార్ మాట్లాడుతూ పుట్టిన శిశువుకు ఎదుగుదల, వారి సంరక్షణకు మొదటి నెలే అత్యంత కీలకమన్నారు. కంగారూ కేర్ శిశు వులకు ఇచ్చే తల్లులు చేతులను, ఛాతీని శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమయంలో ఎటువంటి క్రీమ్స్, లోషన్స్, సెల్‌ఫోన్లు వాడరాదన్నారు. కంగారు కేర్‌లో శిశు వు ఉన్నప్పుడు బిడ్డ కిందకు జారిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంగారు కేర్ వల్ల శిశువుకు తల్లి చర్మం తగిలినప్పుడు బిడ్డకు అవసరమైనంత వెచ్చదనం లభిస్తుందన్నారు. శరీర ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుందన్నారు. శిశువు త్వరగా బరువు పెరగడానికి సహాయపడుతుందన్నారు. తక్కువ బరువుతో పుట్టిన బిడ్డలకు శ్వాస ఆగిపోయే ప్రమాదం ఉంటుందని, కాంగారూ సంరక్షణలో ఈ ప్రమాదం తగ్గి క్రమంగా శ్వాస తీసుకొనే అవ కాశం ఉంటుందన్నారు. తల్లిబిడ్డల అనుబంధం పెరుగుతుందన్నారు. అంతే కాకుండా బిడ్డ తల్లి చాతికి తగిలిన సమయంలో పాలు ఇవ్వాలనే భావన కలుగు తుందన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్లు నవ్యశ్రీ, హరీషా, అమృత, సిఇఒ డాక్టరు భాస్కర్, జనరల్ మేనేజర్ ఆనంద్, తల్లులు, హస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టరు టి.రవి కుమార్

ప్లాస్టిక్ కవర్లను నిషేధించరూ..

పట్టించుకోని అధికారులు..

ప్రజాశక్తి-కోవూరు

ప్లాస్టిక్ కవర్లను ప్రతి దుకాణంలోనూ యథేచ్ఛగా అమ్ముతున్నారు.అధికారులు మాత్రం అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల తర్వాత ఆ విషయాన్ని గాలికొది లేస్తున్నారు. ఆ ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రభుత్వం ఎన్నో మార్లు ప్రకటనలిస్తుంది. అవి ప్రకటనలకు మాత్రమే ఉపయోగపడతున్నాయి. వీటిని పట్టించుకున్న దాఖలాల్లేవు. పాలిథిన్ కవర్లు వాడడం వలన మన ఆరోగ్యాన్ని మనమే పాడు చేసుకుంటున్నాం. నిజ జీవితంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం సర్వసాధారణమైంది. కొనుగోలు చేసిన ప్రతి వస్తువును ఇంటికి తీసుకు వెళ్లాలన్నా ప్లాస్టిక్ కవర్లను ఆశ్రయిస్తున్నారు. వీటిని వాడటంతో పర్యావరణ తో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. అయినను దీన్ని ఎవరు పట్టించుకోవడం లేదు. ప్లాస్టిక్ బ్యాగుల్లో కేన్సర్ కారక రసాయనపదార్థం ఉంటుంది. ఈ కవర్లలో తీసుకువచ్చే పదార్థాలు తినడం వల్ల కేన్సర్ కణాలు శరీరంలో తయార వుతాయని వైద్యులు చెబుతున్నారు. వీటిని వాడడంతో శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.ఏదేమైనా ప్లాస్టిక్ వాడకంతో ప్రతి ఒక్కరూ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. వీటిని పూర్తిగా నిషేధించాలని పలువురు కోరుతున్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా 'బుర్రా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం ,

మండల పరిధిలోని గ్రామంలో కందుకూరు వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ 53వ పుట్టినరోజు వేడుకలను వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత భారీ కేక్ కట్ చేసి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుర్రా మధుసూదన్ యాదవ్ నిండు నూరేళ్ల సుఖ:సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్ఐసి మాల్యాద్రి, గద్దగుంట రమణయ్య, బచ్చు వెంగళరావు, బచ్చు రోశయ్య, బచ్చు శీను, మద్దులూరి వేణు గోపాల్, దేగా ఓంకారం, టెంకం ప్రసాద్, మీసాల వెంకటేష్, మద్దులూరి మాల్యాద్రి, బచ్చు నవీన్, బోరయ్య,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-లింగసముద్రం

కందుకూరు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పిచ్చాపాటి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. నాయకులు,కార్యకర్తలు బుర్ర మధుసూదన్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫీ, వైసిపి నాయకులు మాచేపల్లి మాల్యాద్రి,మట్టే మాల్యాద్రి, గొర్రెపాటి చెంచురామయ్య, కిలారి సురేంద్ర, పోతులూరాయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ సముద్రంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

'బుర్రా'కు సర్పంచ్ శుభాకాంక్షలు

కందుకూరు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి బుర్ర మధుసూదన్ యాదవ్ ను యర్రారెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ డబ్బుగొట్టు మల్లికార్జున కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం కందుకూర్ లోని వైసీపీ కార్యాలయంలో ఆయన కలిసిన సర్పంచ్ మల్లికార్జున బొకే అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు.


'బుర్రా'ను కలిసిన సర్పంచ్


విద్యార్థులతో గ్రంథపాలకుడు కోటేశ్వరరావు

వేసవిలో శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఉలవపాడు:

స్థానిక శాఖ గ్రంథాలయం లో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం నుంచి జూన్ 7వ తేదీ వరకు 24 రోజులు శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథపాలకుడు డి. కోటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు ప్రతేడాది లాగే ఈఏడాది కూడా ఎక్కువ మంది విద్యార్థులు జరిగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని కొత్తగా వచ్చిన పుస్తక సంపద ఉపయోగించుకొని విద్యార్థులు విజ్ఞాన వంతులుగా కావాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి

రాష్ట్రంలో 130 సీట్లు గెలుస్తున్నాం..

..మాది అరాచకం కాదు..అభివృద్ధి చేసి చూపిస్తాం

..టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శ-బీద

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి 130కి పైగా సీట్లు వస్తాయని, వైసిపిలాగా అరాచకం కాకుండా,, అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండ్రోజులుగా వైసీపీ నేతల స్వరం గమనిస్తే సీట్లు మించే అవకాశం ఉందనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసుల తీరు ఇప్పటికీ మారలేదన్నారు. అధికారులమనే విషయం వారు ఏనాడో మరిచి పోయారన్నారు. తిరుపతి పద్మావతి కాలేజీ వద్ద స్ట్రాంగ్ రూమ్ వద్దకు సమ్మెటలు, రాడ్లతో 100 మంది వైసీపీ రౌడీలు ఎలా రాగలిగారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జూన్4 వరకు ఈవిఎంల రక్షణ బాధ్యత పోలీసులదేని గుర్తుచేశారు. .తాము అధికారం చేపట్టాక అభివృద్ధితో వైసీపీపై ప్రతీకారం తీర్చుకుంటా మన్నారు. నెల్లూరు జిల్లాలో 80 శాతం పోలింగ్ జరిగిందని, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉప్పెనలా తరలి వచ్చిన జిల్లా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతిలో బాధ్యత గల ఎస్‌పి హోదాలో రక్షణ కల్పించాల్సిన అధికారి అదొక చిన్న సంఘటన అని నాని సంయమనం పాటించాలని చెప్పి చేతులు దులుపుకుంటున్నారన్నారు. స్ట్రాంగ్ రూమ్ దగ్గర దాకా వందలాది మంది రౌడీలు వచ్చారంటే ఈవిఎంలకు రక్షణ ఎక్కడ ఉందన్నారు. గూడూరులోని పోలింగ్ బూత్‌లో అభ్యర్థి మేరిగ మురళి, వైసిపి నేత నరేంద్రరెడ్డిల సూచనతో ఎస్ఐ అంజిరెడ్డి రామచంద్రా రెడ్డి అనే నాయకుడిని కొట్టడమే కాకుండా తిరిగి వైసీపీ వారికి అప్పగించడం హేయమైన చర్య అన్నారు. ఎన్.డి.ఎ. కూటమి గూడూరు అసెంబ్లీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ పై చిల్లకూరులో వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేస్తే కేసు నమోదుకు సైతం పోలీసులు వెనకడుగు వేశారన్నారు. ఎస్ఐ అంజిరెడ్డి, సిఐ వేణుగోపాల్‌రెడ్డి, డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి లు పోలీసు యూనిఫాం వేసుకున్న వైసీపీ కార్యకర్తలు.గా పనిచేశారన్నారు. చింతవరంలో తెలుగుదేశంపార్టీ కాపు నేత గోపాల్ పై దాడి జరిగిందన్నారు. వైసీపీ గూండాలు వదిలిపోతే కొన ఊపిరితో నేడు కోలుకుంటున్నారన్నారు. ఇంత జరిగినా ఎలాంటి కేసు నమోదు కాలేదన్నారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను పలుచోట్ల రౌడీ షీటర్‌లు, వైసీపీ కార్యకర్తలు బెదిరించారన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీస స్పందన లేదన్నారు.అల్లూరు మండలం, బీరంగుంట పంచాయతీ టీడీపీ నాయకులు తిరుమల శెట్టి శ్రీనివాసులు పై వైసీపీ రౌడీలు దాడి చేస్తే 324 కేసుతో సరిపెట్టి చేతులు దులుపుకున్నా రన్నారు.వైసీపీ నేతల కనుసన్నల్లో పోలీసులు మెలిగారన్నారు. సార్వత్రిక ఎన్నికలు సాధ్యమైనంత మేర సజావు గా జరిగేందుకు సహకరించిన అధికారులకు, మీడియా మిత్రులకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. పోటీలోని కూటమి అభ్యర్థి గెలుపు కోసం అవిశ్రాంతంగా శ్రమించిన జనసేన, బిజెపిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ , ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు జెడ్ శివప్రసాద్, రూప్‌కుమార్‌యాదవ్, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం..

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాశుధ్యం అధ్వానంగా ఉంది. ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, మద్రాసు బస్టాండ్, పెద్దబజార్, చిన్నబజార్ సెంటర్లలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. సంబంధిత అధికారులు పారిశుధ్య మెరుగునకు కృషిచేయాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

రెండు బైక్‌లు ఢీ-వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-నెల్లూరు డెస్క్

రెండు బైక్‌లు ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈసంఘటన కలువాయి మండలం ఉయాలపల్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..కలువాయి నుంచి సోమశిల కు వెళ్తున్న వెంకటేశ్వర్లు, ఉయ్యాలపల్లి నుంచి కలువాయి కి వస్తున్న పామర్తి నాగయ్య, పెంచలయ్య బైక్ లు ఢీకొన్నాయి. ఈ ఘటన లో సోమశిలకు చెందిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పామర్తి నాగయ్య, పెంచలయ్య లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనం లో ఆసుపత్రికి తరలించారు. కలువాయి ఎస్ఐ అయ్యప్ప సంఘటన స్థలాన్ని చేరుకుని విచారణ చేస్తున్నారు.మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నెల్లూరు తరలించారు.కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోతిరెడ్డిపాళెం రోడ్డు అధ్వానం

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పోతిరెడ్డిపాళెం రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు మొత్తం రాళ్లు పైకిలేచి ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవు తున్నారు. కొంత మంది పడిన సందర్భా లున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాల్లేవు. రాత్రి సమయంలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఆటోవాలాలు ఈ రోడ్డు మీద ప్రయాణం కొనసా గించాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం ఈ గుంతల్లో మట్టి కూడా వేసిన దాఖ లాల్లేవు.ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కత్తి గాయాలైన దృశ్యం

వ్యక్తికి కత్తిపోట్లు

ప్రజాశక్తి-కందుకూరు

పేకాట ఆడుతూ ఇద్దరి మధ్య చెలరేగిన వివాదం కత్తి పోట్లకు దారితీసింది. పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ ప్రాంతంలో బుధవారం ఘటన చోటుచేసుకుంది. అదే కాలనీకి చెందిన ఇరువురు పేకాట ఆడుతుండగా వివాదం జరిగింది. డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఎద్దు శివ అనే వ్యక్తి పై మరో వ్యక్తి కోడికత్తితో దాడి చేశాడు. శివకు తీవ్ర గాయాలవడంతో కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రమైన గాయాలు ఉండటంతో శివను మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్లారు. ఇరువురు కూడా ఎన్నికల కోసం హైదరాబాదు నుంచి కందుకూరు వచ్చినట్టు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదాని స్కూల్లో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సిబిఎస్ఈ పదవ తరగతిలో ఆదాని వరల్డ్ స్కూల్ వంద శాతం త్తీర్ణతను సాధించింది. స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ సిరియాల్ తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి గాను సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాలలో అదాని వరల్డ్ స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతసాధించారనీ స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ సిరియాల తెలియజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అదానీ వరల్డ్ స్కూల్ రెండవ బ్యాచ్ విద్యార్థులు 100 శాతం విజయాన్ని సాధించారని తెలిపారు. వీరిలో కల్కి సాయి హర్షిత్ రెడ్డి 490 మార్కులతో స్కూల్ టాపర్‌గా, జిల్లాలో రెండవ స్థానం లో నిలువగా, ప్రియాన్ష్ దుబే 480 మార్కులు, విశాల్ 458 మార్కులతో నిలిచారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేశారు . ఉత్తీర్ణతలో ఇద్దరు విద్యార్థులు గణితంలో వందకి వంద మార్కులు సాధించారు. ఇద్దరు విద్యార్థులు సోషల్ విభాగంలో 99 మార్కులు, ఒక విద్యార్థి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో వందకి వంద మార్కులు సాధించారని తెలియ జేశారు. ఈ విజయంలో భాగం గా విద్యార్థుల నిరంతర కృషికి ఉపాధ్యాయులు అంకిత భావానికి నిజమైనటువంటి విజయాన్ని పొందారని తెలియజేశారు. అదానీ వరల్డ్ స్కూల్లో విద్యార్థులకు వివిధ క్రీడలతో పాటు అనేక రంగాలలో వారి ప్రతిభనీ చాటి చెప్పే విధంగా వారిలో ఉండేటటువంటి నైపుణ్యాలను వెలికి తీసి విద్యా బోధన జరుగుతుందని తెలియజేశారు. పట్టుదలతో నిరంతర కృషి చేసి విజయం సాధించినందుకు విద్యార్థులకు అభినంద నలు తెలియజేస్తూ భవిష్యత్తులో మంచి విజయాలతో ఉన్నతమైన స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

అభ్యర్థుల భవితవ్యం భద్రం..!

-ఎవరిని వరిస్తుందో విజయం..?

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

స్ట్రాంగ్ రూములకు చేరిన ఎలక్ట్రా నిక్ ఓటింగ్ మిషన్ల (ఈవిఎం) లో అభ్యర్థుల భవితవ్యం అత్యంత భ ద్రంగా నిక్షిప్తమై ఉంది. ఈ మేరకు సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులకు ఓటర్లు ఇచ్చిన తీర్పు నె ల్లూరు రూరల్ మండలం, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కాలేజీ (కనుపర్తిపా డు) లో నిక్షిప్తంగా ఉంది. విజయం ఎవరిని వరిస్తుందో అనేది తె లియాలంటే మరో 20 రోజులు ఆగాల్సిందే. సర్వేపల్లి నియోజకవ ర్గంలో వైసీపీ, టీడీపీ (కూటమి), కాంగ్రెస్ బిఎస్పీ, స్వతంత్ర అభ్యర్థు లు పోటీ చేసినప్పటికీ ప్రధాన పోటీ వైసీపీ అ భ్యర్థి కాకాణి గోవర్ధన్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమో హన్ రెడ్డిల మధ్య మాత్రమే నెలకొం ది. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ సరళిని 2019 లో జరిగిన సార్వత్రిక ఎ న్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో ఓటింగ్ నమోదయ్యింది.

దాదాపుగా ఇదే పరిస్థితి సర్వేపల్లి నియోజకవర్గంలో కనిపించింది. ఎన్నికల అధికారులు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయాన్ని నిర్ణయించింది. నియోజక వర్గంలోని పలు బూత్ ల్లో రాత్రి 10 గంటల వరకు కొన్ని బూత్ లో అ యితే రెండో రోజు అంటే 14వ తేదీ (తోటపల్లి) కూడా కొనసాగడం గమ నించదగ్గ విషయం. సర్వేపల్లినియో జకవర్గంలో మొత్తం 2.32 లక్షల ఓట్లకు గాను 1,94,618 ఓట్లు (83.88 శాతం) పోలయ్యాయి. అత్యధికం గా తోటపల్లిగూడూరు మండలం (86.86 శాతం) 36,127, అత్యల్పం పొదలకూరు మండలం (81.1శాతం) 48,553 ఓట్లు నమోదయ్యాయి. పోలింగ్ శాతంలో మనుబోలు రెండో స్థానంలో (85.30) 27,494, మూడో స్థానంలో ముత్తుకూరు (83.01) 38,154 నిలిచాయి. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలన్న కసి, ఉత్సాహం ఓటర్లలో కనిపించింది. పెద్ద ఎత్తున పోలింగ్ శాతం పెరగడానికి కారణం ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకతే కారణం అని టీడీపీ భావిస్తోంది. అధికార పార్టీ వైసీపీ మాత్రం చేసిన అభివద్ధి, అమలు చేసిన ప్రజలు చూపిన విశ్వాసం అని అంటోంది. ప్రజలు ఇచ్చిన తీర్పు ఏదైనా స్ట్రాంగ్ రూమ్ లో భద్రమైన వైసీపీ అభ్యర్థి గోవర్ధన్ రెడ్డి, కూటమి (టీడీపీ) అభ్యర్థి చంద్రమోహన్ రెడ్డి భవితవ్యం ఏమిటన్నది జూన్ 4వ తేదీ తేలనుంది.

స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న పోలీసులు

మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు షమీవుల్లా

నేడు ఉచిత ఖత్నాల కార్యక్రమం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట జామియాన మసీద్ పక్కన ఉన్న ఎం కె ఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సహకారంతో కావలి నియోజకవర్గంలోని పేద ముస్లిం పిల్లలకు ఒడుగులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైనార్టీ నాయకులు షమీవుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఎం కె ఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం కావలి నియోజకవర్గం పేద ముస్లిం పిల్లల కోసం సున్తీ కార్యక్రమాన్ని కోవూరు ప్రత్యేక సీనియర్ డాక్టర్ల పర్యవేక్షణలో నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని కావలి నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు ఉపయోగించుకోవాలని కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముత్తహర్, మహమ్మద్ హుస్సేన్, ఖాదర్ భాషా, ఖలీల్, డబ్బేరు శ్రీధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలకు అభినందనలు

ప్రజాశక్తి-కావలి

13వ తేదీ సాయంత్రం వరకు వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరికీ టిడిపి బి.సి.సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరు బాలగురుస్వామి శుభాకాంక్షలు తెలిపారు. చాలాచోట్ల అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగిందంటే జనాలు ఎలక్షన్ కోసం ఎదురు చూస్తున్నారనే మాట తేట తెల్లమైనది, ఎన్.డి.ఎ. కూటమికి 63శాతంకు పైబడి ఓటుశాతం రాబోతున్నదని, 162 సీట్లలో విజయం సాధించి సునామీ సృష్టించబోతున్నామని తెలిపారు. కావలి ఎంఎల్ఎ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి 20వేలు పైచిలుకు మెజార్టీతో, తమ నెల్లూరు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 2లక్షలకు పైచిలుకు మెజారిటీతో గెలిచి నెల్లూరు జిల్లా స్వీప్ చేయబోతున్నారని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నాయీబ్రాహ్మణ సోదరులు అందరూ కలిసికట్టుగా పని చేశారని, ఆంధ్ర రాష్ట్రం ప్రజల కోసం, భావితరాల భవిష్యత్తు కోసం జరిగిన సంగ్రామంలో అహర్నిశలు కష్టపడ్డ రాష్ట్ర నాయీబ్రాహ్మణ జాతి ముద్దు బిడ్డలు అందరికీ రాబోయే రోజుల్లో మంచి జరగాలన్నారు. వారిస్థాయికి తగ్గగుర్తింపు, గౌరవం రావాలని, అలానే మన నాయీబ్రాహ్మణ కులం రాజకీయంగా ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. టిడిపి విజయం కోసం నిరంతరం పని చేసిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సోదరులు అందరికీ మరొక్కసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని బాలగురుస్వామి తెలిపారు.

అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని తరలిస్తున్న దృశ్యం

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో వెంటిలేటర్ లేక అవస్థలు
- బంధువుల ఆందోళన

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు పట్టణంలోని మహాదేవపురం అడ్డరోడ్డు వద్ద బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో పాలవ్యాను బైక్‌ను ఢీ కొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన వ్యక్తి మహదేవపురం శ్రీనివాస కాలనీ కి సంబందించిన కె.కిషోర్‌గా గుర్తించారు.గాయపడిన కిషోర్ ను ఒంగోలు లోని సంఘమిత్ర కి తరలించడంతో అక్కడి వైద్యులు పరిస్థితి విషమం గా ఉందని చెప్పడంతో చేసేదేమీ లేక కందుకూరు లోని ఏరియా వైద్యశాలకు తరలించారు.కందుకూరు ఏరియా వైద్యశాలలో వెంటిలేటర్ సౌకర్యం లేకపోవడంతో వైద్యులు చేర్చుకోవపోవడంతో కిషోర్ బంధువులు ఆందోళనకు దిగారు. అరగంట సేపు జరిగిన ఆందోళనలో వైద్యులు వైద్యశాల లో పరికరాలు లేవని చెప్పడంతో బందువులు చేసేది ఏమీ లేక తిరిగి ఒంగోలు రిమ్స్ కి తీసుకెళ్లారు.ప్రమాదం జరిగిన సంఘటన వివరాలను పట్టణ ఎస్ఐ ఆనంద్ భాస్కర్ వివరంగా అడిగి తెలుసుకున్నారు.కిషోర్ సింగరాయకొండ నుంచి కందుకూరు కి వస్తుండగా పాల వ్యాన్ కందుకూరు పట్టణం నుంచి మహాదేవపురం అడ్డ రోడ్డు మీదుగా మహదేవపురం వెళుతుండగా సంఘటన జరిగినటు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలాన్ని చేరుకొని పాల వ్యాను సహా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు కోసం తరలొచ్చిన ప్రవాసాంధ్రులు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఖండాంతరాలలో నివసిస్తున్న ప్రజలు కూడా తరలొచ్చారు. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి విదేశాలలో నివసిస్తున్న ఎందరో సాఫ్ట్‌వేర్ నిపుణులు, విద్యార్థులు ఓటు వేయడానికి విమానాలకు రెక్కలు కట్టుకొని కందుకూరుకి వచ్చారు. ఈ నియోజకవర్గంలో ఈ నెల 13న ఎన్నికల జరిగిన విషయం తెలిసిందే. ఈ నియోజక వర్గానికి చెందిన దాదాపు 7వేల మంది ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, వ్యాపారులు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లారు. వారిలో విదేశాలకు వెళ్లిన ఐటీ నిపుణులతో పాటు అమెరికా వంటి దేశాలకు చదువుకోవడం కోసం వెళ్లిన వారు కూడా ఉన్నారు. ఓటింగ్‌లో పాల్గొనడానికి ఇతర దేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు అతి కొద్ది మందే వచ్చినప్పటికీ సాఫ్ట్‌వేర్ నిపుణులు మాత్రం పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణులలో అత్యధికులు తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తున్న ఒక సామాజిక వర్గం వారే. కందుకూరు పట్టణంతో పాటు మహాదేవపురం వంటి గ్రామాలకు చెందిన ప్రవాసాంధ్రులైన సాఫ్ట్‌వేర్ నిపుణులు ఇక్కడ స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరితోపాటు హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరు, ముంబై, పూణే, ఢిల్లీ వంటి నగరాలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక హైదరాబాద్, చెన్నయ్,బెంగుళూరు వంటి నగరాలకు ఉపాధి కోసం వెళ్లిన భవన నిర్మాణ కార్మికులు కూడా పెద్ద ఎత్తున తరలొచ్చారు. వలస వెళ్లిన భవన నిర్మాణ కార్మికుల్లో గుడ్లూరు, ఉలవపాడు మండలాలకు చెందిన పేదలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అలాగే బతుకుదెరువు కోసం తెలంగాణ, ఒడిశా ,కర్ణాటక రాష్ట్రాల తో పాటు మన రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతాలలో జ్యూస్ దుకాణాల నిర్వహణకు వెళ్లిన పేద మధ్యతరగతి ప్రజలు కూడా పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవడానికి తరలివచ్చారు.

ఉలవపాడు మండలం, కృష్ణాపురం, గుడ్లూరు మండలం కొత్తపేట, అడవి రాజుపాలెం తదితర గ్రామాల ప్రజలు ఏటేటా జనవరిలో ఇతర రాష్ట్ర, ప్రాంతాలకు వెళ్లి జ్యూస్ దుకాణాలు నిర్వహిస్తారు. స్థానికంగా తయారు చేసే ఈ జ్యూస్ అమ్మకాలకి మంచి లాభాలు లభిస్తాయి. దాంతో సంక్రాంతి వెళ్లిన తర్వాత జ్యూస్ దుకాణాలు పెట్టడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు జూన్ ,జూలైలలో ఖరీఫ్ వర్షాలు ముమ్మరించిన తర్వాత తిరిగి స్వగ్రామాలకు వస్తారు. మధ్యలోనే ఎన్నికలు రావడంతో వారంతా స్వగ్రామాలకు వచ్చి ఓటు వేసి వెళ్లారు.భవన నిర్మాణ కార్మికులతో పాటు హైదరాబాద్, చెన్నయ్ ,బెంగళూరు వంటి నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్ నిపుణులు ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు రాకపోకల ఖర్చులకు ముందుగానే డబ్బులు చెల్లించారు.అటు తెలుగుదేశం పార్టీ ఇటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇలాంటివారికి రాకపోకల ఖర్చులు కింద ముందుగానే ఫోన్ పే ద్వారా దూరాన్ని బట్టి రెండు వేల నుంచి మూడు వేల రూపాయలు చెల్లించారు. ఆ తర్వాత ఓటు వేసే ముందుగా అలాంటి వారందరికీ ఓటుకు రూ.2వేలు కూడా ఇచ్చారు. ప్రత్యేకించి హైదరాబాదులో ఈ నియోజకవర్గానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారి ఓట్లను ఆకర్షించేందుకు వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు ఎన్నికలు ముందుగానే హైదరాబాదుకి వెళ్లి హైదరాబాదులో రెండు చోట్ల ఈ ప్రాంత భవన నిర్మాణ కార్మికుల సమావేశాలు నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు, జ్యూస్ నిర్వాహకులు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కొక్కరికి ఓటుకి సగటున రూ.ఐదువేల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం.

61వ సారి రక్తదానం చేస్తున్న రవికుమార్

ఆర్‌టిసి ఉద్యోగి రవికుమార్ రక్తదానం

ప్రజాశక్తి-కావలి

ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొర్లు రవికుమార్ రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో బుధవారం 61వ సారి రక్తదానం చేశారు. గత 30యేళ్ల నుండి రవికుమార్ క్రమబద్ధంగా సంవత్సరానికి రెండు, మూడు సార్లు రక్తదానం చేస్తూ, నేత్రదాన ఆవశ్యకతను ప్రచారం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ నుండి రెడ్‌క్రాస్ పురస్కారాన్ని అందుకున్నారు. అంతేకాక పేద విద్యార్థులకు సులభరీతిలో ఆంగ్ల భాషను నేర్చుకునేందుకు పలు హైస్కూళ్లలో ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను పంపిణీ చేస్తుంటారు. బుధవారం 61వ సారి రక్తదానం చేసిన రవికుమార్‌ను, 6వ సారి రక్తదానం చేసిన అతని కుమారుడు కొర్లు వెంకట చిరంజీవిని కావలి ఆర్‌టిసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, సూపరింటెండెంట్ (పర్సనల్) గంగు విజయకుమారి, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డి.రవి ప్రకాష్, రక్తకేంద్రం సిబ్బంది అభినందించారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజల ఆరోగ్యమే పరమావధిగా జరుగుతున్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఆత్మకూరు పురపాలక పరిధిలోని మున్సిపల్ బస్టాండ్ ప్రాంగణంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 110 మందికి పైగా రోగులకు వైద్యసేవలు అందించారు. డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో షుగర్, బిపి, తదితర వ్యాధులకు చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మా మాట్లాడుతూ గతంలో వైద్య సేవలు పొందిన వారికి ఫోన్ ద్వారా సమాచారం పంపామని మందులు కావాల్సిన వారికి ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలియజేశారు. కొత్తగా వైద్య సేవలు అందిన వారికి ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకునేలా ఆశా కార్యకర్తల వైద్య సిబ్బంది కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన గేదె

పిడుగుపడి గేదె మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు

పిడుగుపాటుతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మహ్మదాపురం పంచాయతీ కురుపువానిపల్లె గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జంగాత నాగేశ్వరరావు గేదె పొలంలో మేస్తుండగా అకస్మాత్తుగా పెద్దగాలి ఉరుములతో వర్షం పడింది. ఆ సమయంలో పిడుగుపాటుకు గురై గేదె పొలంలోనే మృతి చెందింది. మృతి చెందిన గేదెను చూసి పాడెను నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతు నాగేశ్వరరావు లబోదిబోమని బోరున విలపించారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

కావలి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా..

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తానని ఎన్‌డిఎ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం కావలి టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కావలి అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో ప్రజలు ముందుకు వచ్చారని, టిడిపిని ఆశీర్వదించారన్నారు. తన గెలుపునకు కారణమైన ప్రతిఒక్కరి సహకారంతో కావలిని అభివృద్ధి చేస్తానన్నారు. మండుటెండను సైతం లెక్కచేయక బారులు తీరి గంటల తరబడి క్యూ లైన్‌లలో నిరీక్షించి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 10 గంటల తరువాత వైసిపి నాయకులు పోలింగ్ స్టేషన్స్ వద్ద ఉద్రిక్తత వాతావరణం సృష్టించారని, పోలింగ్‌కు ఉన్నత స్థాయి కుటుంబాలు వచ్చే పరిస్థితులు లేకుండా చేశారన్నారు. బీరంగుంట, అల్లూరు, ముసునూరులలో కార్యకర్తలు, నాయకులపై దాడులుచేయడం జరిగిందన్నారు. హై క్లాస్ ఫ్యామిలీస్ వస్తాయని తెలిసి, పోలింగ్ జరగకుండా చూడాలని కుట్రలు పన్నడం జరిగిందన్నారు. వైసిపి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నిన టిడిపిని ప్రజలు ఆశీర్వదించారని, కావలికి సేవ చేసే భాగ్యం కల్పించారని తెలిపారు. ఎంఎల్ఎగా గెలిచిన మూడవ రోజునే సొంత డబ్బులు పెట్టుకొని అయినా, ప్రభుత్వ నిధులతోనైనా సరే తుమ్మలపెంట రోడ్డును వేయడం జరుగుతుందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సామర్థ్యం పెంచి, అమృత్ పథకం పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికీ నీరు అందిస్తానని తెలిపారు. తనను నమ్మి టిడిపిని ఆశీర్వదించారని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబు రావు, నియోజకవర్గ పరిశీలకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, మన్నవ రవిచంద్ర, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి అలేఖ్య, మైనారిటీ నాయకులు ఇట్టు, రహీం, దావులూరి దేవకుమార్, గుండ్లపల్లి శివాజీ, బిజెపి నాయకులు భరత్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'కాకర్ల'కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-ఉదయగిరి

కాకర్ల సురేష్‌ను అభినందిస్తున్న మహిళలు

ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుండి టిడిపి నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు సన్మానాలు పూలగుచ్చాలతో అభినందనలు తెలిపారు. బుధవారం వింజమూరు మండలం లోని బొమ్మరాజు చెరువులోని టిడిపి కార్యాలయానికి తెలుగుదేశం పార్టీ విజయం తలపించినట్లుగా అధిక సంఖ్యలో మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెల్లువెత్తారు. చేరుకొని ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు అభినందనలు తెలిపారు. ఉదయగిరి కోటపై దాదాపు 25వేల మెజారిటీతో టిడిపి జెండా ఎగరబోతుందని భరోసా కల్పిస్తున్నారు. 8 మండలాల్లో ఉదయగిరి మినహాయించి అన్ని మండలాల్లో టిడిపి విజయం సాధిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరిలో కూడా స్వల్ప మెజార్టీ వైసిపికి వచ్చే అవకాశం ఉందని, విశ్లేషణ చేస్తున్నారు. పార్టీ కార్యాలయంలో నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో కాకర్ల సురేష్‌ను ఘనంగా సన్మానించారు. జూన్ 4వ తేదీ సంబరాలు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. 120 సీట్లు పైబడి తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఉదయగిరిని సిరుల గిరిగా చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వలస ఓటర్ల వేదన

ప్రజాశక్తి-ఉదయగిరి

ఇతర రాష్ట్రాల నుంచి ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వచ్చిన వలస ఓటర్ల కుటుంబాలు తిరిగి తమ గమ్యస్థానం చేరేందుకు ఆర్‌టిసి బస్సుల రిజర్వేషన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ లేనివిధంగా 32వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయగిరి నియోజకవర్గం చేరుకున్నారు. తిరిగి వారి ప్రాంతాలకు చేరేందుకు సొంత వాహనాలు ఉన్నవాళ్లు వెళ్లిపోగా ఆర్థిక స్థోమత ఉన్నవాళ్లు అద్దె వాహనాలు మాట్లాడుకొని వెళ్లారు. సాధారణ జనాలు మాత్రం ఆర్‌టిసి బస్సుల పైన ఆధారపడి రిజర్వేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. 17వ తేదీ వరకు రిజర్వేషన్లు లేకపోవడంతో ఎలా వెళ్లాలో తెలియక ఉదయం పూట బయల్దేరి బస్సులు మారుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ ఇబ్బందిని గమనించి ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని వలస ఓటర్లు కోరుతున్నారు.

అడుగడుగునా సమస్యలే..

ప్రజాశక్తి-వరికుంటపాడు

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆ గ్రామం పాలకులు పట్టించుకునే పరిస్థితిలో లేదు. ఎన్నికల సమయంలో మాత్రమే పట్టించుకునే ఆ గ్రామంలో వసతులు అరకొరగానే ఉన్నాయి. దాంతో ఇచ్చిన హామీలు గాలికి వదిలేయడంతో అడుగడుగునా సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. అది ఎక్కడో కాదు మండలంలోని తోటలచెరువుపల్లి పంచాయతీలోని పరిస్థితి.

రోడ్డుపై ఉన్న పేడ దిబ్బ

చిన్నపాటి వానకే బురదమయమైన రోడ్డు

పంచాయతీలో తోటల చెరువుపల్లి, సాత్వారిపల్లి, కొండరాజ పల్లె అనే గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీలో సుమారు 2వేల మంది జనాభా నివసిస్తున్నారు. వారికి అన్ని సమస్యలే అంతర్గత రోడ్ల వల్ల చినుకు పడితే చాలు బురదమయం అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాలు అయినా కూడా, నేటికి కూడా సిసి రోడ్లకు నోచుకోలేదు. దాంతో వర్షం పడితే రోడ్లన్నీ చిత్తడి చిత్తడిగా అవుతున్నాయి. అడుగు తీసి అడుగు వేయాలంటే చాలా దుర్భర పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారు. అభివృద్ధి ఆమడదూరంలో ఉంది. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఎక్కడా లేవు. వర్షం పడితే ఇంటిలోకి నీళ్లు చొరబడుతున్నాయి. ప్రభుత్వమేమో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛభారత్ అనే కార్యక్రమాల కింద ప్రగల్బాలు పలికింది కానీ ఇక్కడ మాత్రం వీధులకు ఇరువైపులా పేడ దిబ్బలే దర్శనమిస్తుంటాయి. ముఖ్యంగా తోటల చెరువుపల్లి ఎస్‌సి కాలనీ నుండి ఎర్రంరెడ్డిపల్లికి వెళ్లే రహదారి సమీపంలో రోడ్డుపై పేడ దిబ్బలు ఎక్కువగా ఉండడంతో వర్షం పడినప్పుడల్లా ఆ పేడ నీళ్లు అంతా మీదకి రావడంతో దుర్వాసన ఎక్కువగా వస్తుంది. ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు అడుగు వేయాలంటే అల్లాడిపోతున్నారు.

అస్తవ్యస్తంగా రోడ్లు

పిడుగు బాలచంద్ర (తోటల చెరువుపల్లి)

పంచాయతీలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గుంతల మయమయ్యాయి. ప్రధాన రహదారిలోనే ఎస్‌సి కాలనీ రామాలయం సమీపంలోని సిసి రోడ్డు హెచ్చుతగ్గులతో ఉంది. వర్షం వచ్చిన సమయంలో వాగుల నీరు పాడుతుంది. ఏవైనా వాహనాలు వెళ్లాలంటే రోడ్డు కనిపించక గుంతలో పడిపోతున్నారు. పాలకులైన దృష్టి సారిస్తే ఈ పరిస్థితి నుండి గట్టెకుతాము.

రోడ్డుకి ఇరువైపులా పేడ దిబ్బలు

కర్చేటి వరయ్య (తోటల చెరువుపల్లి గ్రామం)

ప్రధాన అర్వదారికి ఇరువైపుల పేడ దిబ్బలు వేశారు. ఇంకెక్కడ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేడ దిబ్బలేన స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ అంటే..? అధికారులు స్పందించి పేడ దిబ్బలను తొలగించి దుర్వాసన లేకుండా చేయాలి. వర్షం పడిన సమయంలో మరి పరిస్థితి అధ్వానంగా ఉంది. ఆ పేడంత రోడ్డు మీదకు వచ్చి బురద మయంగా ఉంటుంది అధికారులు స్పందించాలి.

డాక్టర్ ఆదిశేషయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆదిశేషయ్య జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు, జెసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య జన్మదినం సందర్భంగా బుధవారం పలువురు నాయకులు, అభిమానులు పట్టణంలోని డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య స్వగృహం చేరుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆయనను పాల్గొని పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లా రెడ్డి ఆనంద్ రెడ్డి, మాజీ సిండికేట్ ఫార్మర్ సొసైటీ ఛైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, యువ నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, కొర్సిపాటి హరి కిషోర్ రెడ్డి, తదితరులున్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO. 235/2022

Chittamuru Sridhar ...**Plaintiff**
Vs.
Gandavaram Niranjan Reddy ... **Defendent**
To
Gandavaram Niranjan Reddy, S/o. Sundara Rami Reddy, D.No.27-4-171, 4th Street, Ramji Nagar, Nellore City, SPSR Nellore District.

పై నెంబరులోని వాది ప్రామిసరినోట్ బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసినందున ప్రతివాది అయిన మీకు నోటీసుకు గాను తేది 25.06.2024న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై ప్రతివాది అయిన మీకు ఎలాంటి ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు ఎదుట పై తేదీన ఉదయం 10:30 గం॥లకు వ్యక్తిగతముగాగానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియచేయవలను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

ఇట్లు
యస్.చంద్రమోహన్ రెడ్డి
వాది తరపు న్యాయవాది, గూడూరు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO. 1 of 2022

Vardineni Chandra Kala ...**Plaintiff**
Vs.
1. Vardineni Rajagopal and another ... **Defendents**
To
D-2, Sk. Dileef, S/o. Kalesha, 28-1-721, 1st Street, Maruthi Nagar, Mypadu Gate, Stonehousepet, Nellore City, SPSR Nellore District.

నోటీసు

పై నెంబరులోని వాది తనకు పర్మనెంట్ ఇంజంక్షన్కు గాను దావా దాఖలు చేసినందున 2వ ప్రతివాది అయిన మీకు నోటీసుకు గాను తేది 20.06.2024న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై 2వ ప్రతివాది అయిన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట పై తేదీన ఉయదం 10:30 గం॥లకు కోర్టు నందు వ్యక్తిగతముగాగానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియచేయవలను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

ఇట్లు
ఈదూరు భాస్కరయ్య
వై. అరవింద్
వాది తరపు న్యాయవాదులు, గూడూరు.